
క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుల నియామకం


మేడిశెట్టి శ్రీనివాసరావు


విత్తనాల ఇంద్రశేఖర్


కొమ్ముల రాము


యన్నాబత్తుల నాగానందకుమార్

మామిడికుదురు: పి.గన్నవరం నియోజకవర్గం లోని నాలుగు మండలాలకు పార్టీ మండల శాఖ అధ్యక్షులను నియమిస్తూ శనివారం ఆదేశాలు వెలువడ్డాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగిందని ఆదేశాల్లో పేర్కొన్నారు. అయినవిల్లి, అంబాజీపేట, మామిడికుదురు, పి.గన్నవరం మండల అధ్యక్షులుగా మేడిశెట్టి శ్రీనివాసబాబు, విత్తనాల ఇంద్రశేఖర్, కొమ్ముల రామచంద్రరావు (రాము), యన్నాబత్తుల నాగ ఆనందకుమార్‌లను నియమించారు. పార్టీ తమపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని నూతనంగా నియమితులైన వారు తెలిపారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకు వస్తామన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్


పిల్లి శ్రీనివాస్


జేవీ రామకృష్ణ

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శిగా పాశర్లపూడి గ్రామానికి చెందిన పిల్లి శ్రీనివాస్‌ను నియమించారు. అలాగే నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా పెదపట్నం లంక మాజీ ఎంపీటీసీ జోగి వెంకటరామకృష్ణను నియమిస్తూ తాడేపల్లి కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగిందని ఆదేశాల్లో పేర్కొన్నారు. నియోజకవర్గం కో-ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు సిఫారసు మేరకు ఈ నియామకం జరిగిందని శ్రీనివాస్, వెంకటరామకృష్ణ తెలిపారు. పార్టీ తమపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తామని తెలిపారు.

రోడ్డు సమస్యను పరిష్కరించాలి

మలికిపురం: మండలంలోని రామరాజులంక పరిధి గండిపేటలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన గ్రామంలో పర్యటించారు. స్థానిక ప్రజానీకం ఇక్కడి పరిస్థితులను సూర్యారావుకు వివరించారు, పంచాయతీ దృష్టికి ఈ విషయాన్ని పలుమార్లు తీసుకువెళ్లిన ఎటువంటి ప్రయోజనం లేదని, నియోజకవర్గ ఎమ్మెల్యేకు కూడా వినతి పత్రాన్ని ఇచ్చామని అన్నారు. సదరు విషయమై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యపై గొల్లపల్లి సూర్యారావు పంచాయతీ కార్యదర్శి ఫోన్ చేసి మాట్లాడి అక్కడ ఉన్నటువంటి రోడ్డు సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామంలో తాగునీటి సమస్యలు కూడా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు రావి గోపాలకృష్ణ, నియోజకవర్గం నల్లి శివకుమార్, సీసీఎఫ్ సొసైటీ అధ్యక్షులు నల్లి బాలకష్ణ, గుర్రం జాషువా అడబాల జానకిరామ్, రాపాక రమేష్, నూకరాజు, ఈదా సుబ్రహ్మణ్యం, అమలదాసు నూకరాజు, ఈద నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

పేదలకు సాయం పంపిణీ

సఖినేటిపల్లి: రామేశ్వరం విలేజ్ వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యాన శనివారం రామేశ్వరం గ్రామ పంచాయతీ వద్ద నిర్వాహకులు 100 మంది పేదలకు సాయం పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ రూ.100 నగదు, 5 కేజీల బియ్యం చొప్పున అందజేశారు. దాతలు సాయంతో ప్రతి నెలా ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు ట్రస్టు ఫౌండర్ సరెళ్ల విజయ్‌ప్రసాద్ తెలిపారు. ఈ నెలకు ట్రస్టు సేవా కార్యక్రమాలకు దాతలు మత్తి లక్ష్మీనరసయ్య రూ.20 వేలు, పాటబళ్ళ సతీష్ రూ.20 వేలు అందజేసినట్టు విజయ్‌ప్రసాద్ అన్నారు. ట్రస్టు మెంబర్లు మధురాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేంకటేశ్వరస్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామికి తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు జరిపారు. వేదపండితులు స్వామికి లక్ష తులసిపూజ నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు భారీ అన్నదానం చేశారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామికి వివిధ పూజల ద్వారా రూ.3,27,308లు ఆదాయం లభించింది. స్వామివారి అన్నదాన ప్రసాదాన్ని 2600 మంది భక్తులు స్వీకరించారు.

కూలిన మురుగుకాలువ వంతెన

- మండపేట-పినపళ్ల మధ్య నిలిచిన రాకపోకలు
- ఖరీఫ్ సాగుకు తిరిగి వెళ్లవలసిన పరిస్థితి
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రైతుల వినతి


పినపళ్లలో మురుగుకాలువ మధ్యలో కూలిన వంతెన


పినపళ్ల శిథిలావస్థకు చేరి కూలిపోయిన వంతెనను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ఆలమూరు: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల మండపేట–ఆలమూరు మండలాలను అనుసంధానం చేసే మురుగు (గొడ్డు) కాలువ వంతెన అర్థాంతరంగా కూలిపోయింది. దీంతో మురుగు కాలువ పైనుంచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పినపళ్ల నుంచి మండపేట వైపు ఉన్న ఆయకట్టు సాగు చేసేందుకు రైతులకు తగిన సౌలభ్యం లేకుండా పోయింది. దీంతో పినపళ్ల నుంచి గొల్లపుంత మీదుగా మండపేట వెళ్లేందుకు మూడున్నర దశాబ్దాల కిందట అప్పటి కాంగ్రెస్ పార్టీ హయాంలో పశుసంవర్ధకశాఖ మంత్రిగా పనిచేసిన సంగిత వెంకటరెడ్డి సహకారంతో ఈ వంతెన నిర్మాణం జరుపుకొంది. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న గ్రామ రైతులకు మరింత సహకారం అందించాలన్న ఉద్దేశంతో ఈవంతెన రూపుదిద్దుకుంది. మండపేట, వల్లూరు ఆయకట్టు భూమికి సంబంధించి మురుగు కాలువ వెంబడి సుమారు 800 ఎకరాల్లో ఏటా వరిసాగు చేపట్టడం పినపళ్ల రైతులకు ఆనవాయితీగా వస్తుంది. దీంతో నారుమడులు పూర్తి చేసి వరినాట్లు వేసేందుకు సన్నద్ధమైన తరుణంలో వంతెన హఠాత్తుగా కూలిపోవడం రైతులకు శాపంగా మారింది. అలాగే మురుగు కాలువ సమీపంలో నిర్మించిన శ్రీకృష్ణ ప్రభాస్ పేపరుమిల్లుకు చెందిన వ్యర్థపునీరు బయటకు వెళ్లేందుకు కూడా అంతరాయం కలగనుంది. దీనివల్ల ప్రత్యక్షంగాను, పరోక్షంగాను స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదమేర్పడింది.

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోతే ఇబ్బందే

పినపళ్లలో మురుగుకాలువపై కూలిపోయిన వంతెన స్థానే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. పంటకు అవసరమైన ఎరువులు, పురుగు మందులను తరలించడంతో పాటు వ్యవసాయ పనులు చేపట్టేందుకు మండపేట నుంచి వయా గొల్లపుంత మీదుగా పినపళ్ల సరిహద్దులో ఉన్న ఆయకట్టు భూమికి రావలసి ఉంది. దీనివల్ల వ్యయ ప్రయాసలకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సర్పంచ్ సంగిత సుభాష్, ఎంపీటీసీ పెదిరెడ్డి పట్టాభి, ఏఎంసీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు సంఘటన స్థలానికి విచ్చేసి పరిస్థితిని సమీక్షించి సమస్యను సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించారు.

ప్రజా ప్రతినిధుల సహకారంతో వంతెన నిర్మాణం

పినపళ్ల గొడ్డు కాలువ వంతెనపై కూలిపోయిన వంతెన పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్ సంగిత సుభాష్ తెలిపారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరిందని భావించి మూడేళ్ల క్రితమే ఇరిగేషన్ అధికారులు నివేదించగా ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సత్వరమే తీసుకువెళ్లి వంతెన కూలిపోవడం వల్ల రైతులు పడే ఇబ్బందులతో పాటు సత్వర నిర్మాణం ఆవశ్యకతను వివరించనున్నామని ఆయన పేర్కొన్నారు.

వరదలను ఎదుర్కొనేందుకు ప్రణాళిక

మామిడికుదురు: గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు ముందస్తు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అమలాపురం ఆర్డీఓ కె.మాధవి అధికారులను ఆదేశించారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో ఎనిమిది గ్రామాలు వరద తాకిడికి గురవుతాయన్నారు. మొదటి ప్రమాద హెచ్చరికకు మండలంలో ఏ గ్రామానికి ఇబ్బంది ఉండదని చెప్పారు. రెండో ప్రమాద హెచ్చరిక నుంచి ముంపు సమస్య ఏర్పడుతుందన్నారు. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పెదపట్నం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు గ్రామాలను వరద ప్రభావిత గ్రామాలుగా గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లో ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారుల నుంచి సమాచారం సేకరించారు. శాఖల వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొందామని పి.గన్నవరం నియోజకవర్గం ప్రత్యేకాధికారి, డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి సూచించారు. సమావేశంలో తహసీల్దార్ పి.సునీల్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శరణ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మాధవి

వరద పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవాలి

పి.గన్నవరం: వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని కొత్తపేట ఆర్డీఓ శ్రీకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన వరద సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. వరద ముంపునకు గురయ్యే లంక గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఆయన శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. అవసరమైన చోట్ల బోట్లు, లైఫ్ జాకెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్, వైద్యం, శానిటేషన్ తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ, నియోజకవర్గ వరదల ప్రత్యేక అధికారి సాయినాథ్ జయచంద్ర గాంధీ, తహసీల్దార్ పి.శ్రీపల్లవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఉమా మహేశ్వరరావు, ఆర్ఐ వెన్నపు వర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ ధర్నా

రావులపాలెం: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు ధర్నా నిర్వహించారు. ఉదయం నుంచి ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. భోజనం విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు మద్దతు తెలిపారు. గేట్ మీటింగ్ పెట్టి నిరసన తెలిపారు. ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ ప్రెసిడెంట్ రావుల సుబ్బారావు అధ్యక్షతన, సెక్రెటరీ జీవీ రావు, ప్రెసిడెంట్ ఎల్ఎస్ రావుల ఆధ్వర్యంలో మీటింగ్ నిర్వహించారు.

గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను వెంటనే తీయాలని, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పదివేల పోస్టులకు వెంటనే సిబ్బందిని నియమించాలని, హామీ ఇచ్చిన ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని, 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నిర్మించాలని, టీం డ్యామేజీ పేరుతో సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు మానుకోవాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని పలు డిమాండ్ల నెరవేర్చాలని ఈ ధర్నా చేస్తున్నట్టు సభ్యులు తెలిపారు.


రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా నిర్వహిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు

మండల కమిటీల సారథులు వీరే..

రాజోలు: నియోజకవర్గంలోని రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండల వైఎస్సార్ సీపీ కమిటీ సారథులను శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. రాజోలు మండల ఉపాధ్యక్షుడిగా బయ్యా శ్రీనివాసరావు, కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులుగా గొల్ల ఉదయ భాస్కరరావు, అప్పారి గోపి, తాడి వెంకటేశ్వరరావు, పుట్టా రవికుమార్, కార్యదర్శులుగా మంద శ్రీనివాసరావు, అప్పారి చిన్నికృష్ణ, కామాడి సత్తిబాబు, బుడితి సత్యనారాయణ, కడలి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా కోరుకొండ రమేష్, వడ్డి గంగా ప్రసాద్, పైడిపర్తి నాగ ఆంజనేయులు, రాపాక శ్రీరామ్మూర్తి, చుట్టుగుళ్ల కిరణ్‌కుమార్, నల్లి సురేష్, గుద్దటి వెంకటేశ్వరరావు, గొల్లపల్లి వరప్రసాద్, రేవు రాంబాబు, నల్లిశ్రీనివాస్, ఇంజేటి శ్రీను నియమితులయ్యారు.

మలికిపురం మండలం నుంచి..

మలికిపురం మండల ఉపాధ్యక్షులుగా గెద్దాడ లక్ష్మీవరప్రసాద్, చెవ్వాకుల రాము, ప్రధాన కార్యదర్శులుగా గుండుమేను నారాయణమూర్తి, కాకులపాటి నరసింహాచార్యులు, ఆదుర్తి సురేష్, రాపాకలక్ష్మణరావు, కార్యదర్శులుగా యాతం సత్తిబాబు, మంద బాబురావు, గోలి రామకృష్ణ, మేడిచర్ల గోపాలం, చెవ్వాకుల సురేష్, కార్యవర్గ సభ్యులుగా సాధనాల రంగారావు, ఓగూరి పాండు, ఒగ్గు అన్నవరం, కుంచే రాజు, దేవ కుమార్, పున్నం నాగేశ్వరరావు, గొల్లమందల ప్రసాద్, వాడపల్లి చిన్నయ్య, మత్తి అజయ్‌కుమార్, కనుమూరి రామకృష్ణంరాజు, చిట్టిశ్రీను నియమితులయ్యారు.

సఖినేటిపల్లి మండలం నుంచి.. : సఖినేటిపల్లి మండల ఉపాధ్యక్షుడిగా రావి వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శులుగా పాటి నెహ్రూ, ముప్పిరి రాజేంద్రప్రసాద్, ముప్పర్తి శ్రీనివాసరావు, కండిబోయిన గణపతిరావు, కార్యదర్శులుగా ఇంజేటి చిట్టి, నల్లి శ్యామలరాజు, యెనుముల త్రినాథ్, ఆంజనేయులు, గుబ్బల నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా జిల్లెళ్ల చిట్టిబాబు, కొక్కిరగెడ్డ సూర్యప్రసాద్, ఎ.రఘు, గంటా రవి, గునిశెట్టి నరేష్, బత్తుల ఏసురత్నం, బైరిశెట్టి నరసింహారావు, చెల్లుబోయిన సాయి, ముత్యాల రామారావు, పెనుబోతు కొండయ్య, కొల్లాబత్తుల రాజు నియమితులయ్యారు.

సంక్షేమంలో మానవత్వం చూపిన నాయకుడు జగన్


సోంపల్లి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

రాజోలు: సంక్షేమ పథకాల్లో మానవత్వాన్ని చూపిన ఏకైక నాయకుడిగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శనివారం సోంపల్లిలో మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన గ్రామ కమిటీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి సూర్యారావు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో నాయకులు పార్టీ చేపట్టే కార్యక్రమాల నిర్వహణపై చొరవ చూపాలన్నారు. కష్టకాలంలో ఉన్నామనే భావన పక్కన పెట్టి వైఎస్సార్ సీపీని దైవంగా భావించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల్లో మానవత్వాన్ని చూపిస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమ పథకాల్లో కోతలు పెట్టి తన నైజాన్ని చూపుతున్నారన్నారు. ఈ నెల 7న ఉయ్యూరి వారి మెరక అల్లూరి సత్యనారాయణరాజు కల్యాణమండపంలో నిర్వహించే ×బాబు షూరిటీ-మోసం గ్యారంటీ× నిరసన కార్యక్రమానికి నియోజకవర్గ స్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని గొల్లపల్లి పిలుపునిచ్చారు. ముఖ్యఅతిథులుగా కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొంటారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు మట్టా శైలజ, జిల్లా ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, మండపేట నియోజకవర్గ పరిశీలకుడు కటకంశెట్టి ఆదిత్య, రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్, అధికార ప్రతినిధి ఉచ్చుల విష్ణుమూర్తి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సతీష్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుంగ శ్రీను, నాయకులు చిత్రపు కిషోర్ చెన్నారెడ్డి, కంచి వెంకటరమణ, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీఈశ్వరి పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహునికి జన్మనక్షత్ర పూజలు

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో లక్ష్మీనృసింహుని జన్మనక్షత్రం స్వాతి పురస్కరించుకుని శనివారం స్వామికి అష్టోత్తర కలశాభిషేకాన్ని అర్చకులు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు పి.రామశేషాచార్యులు, ఎస్‌బీఎం రామకృష్ణమాచార్యులు ఈ పూజలు నిర్వహించారు. తొలుత వశిష్ఠ గోదావరి నది నుంచి కలశాలతో తెచ్చిన పవిత్ర జలాల కలశాలతో అర్చకులు వేదమంత్రాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం 108 కలశలలో ఉంచిన జలాల్లోకి స్వామివారి మూలమంత్రంతో ఆవాహనం చేశారు. అలాగే సర్వదేవతలను కలశాల్లోకి ఆవాహనం చేసి విశేష పూజలు నిర్వహించారు. వీటితో పాటు పంచామృతాలతో, వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి విశేష అభిషేకం, పూజలు చేశారు.

వారాహీ అమ్మవారికి కుంకుమ పూజలు

అంబాజీపేట: మాచవరంలో కొలువుదీరిన వారాహీ అమ్మవారి నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుంకుమ పూజలను ఘనంగా నిర్వహించారు. గత నెల 26 నుంచి నిర్వహిస్తున్న వారాహీ నవరాత్ర మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. వారాహీ అమ్మవారిని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మత సామరస్యాన్ని చాటుకున్న హిందువులు

మామిడికుదురు: మొహర్రం సంతాప కార్యక్రమాల్లో భాగంగా పదో రోజు శనివారం అల్లవరం నుంచి వచ్చిన పీరును మామిడికుదురు, నగరం గ్రామాల్లో ఊరేగించారు. మత సామరస్యానికి ప్రతీకగా పేర్కొనే ఈ పీరుకు హిందువులు పూజలు చేశారు. పీరును దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. పూర్వం నుంచి అల్లవరం నుంచి వచ్చే పీరును హిందువులు దర్శించుకోవడం అనవాయితీగా వస్తోందని ముస్లిం పెద్దలు తెలిపారు. మామిడికుదురు, నగరం గ్రామాల్లో ఊరేగించిన అనంతరం పీరును ప్రధాన జాతీయ రహదారి మీదుగా ఊరేగిస్తూ తిరిగి అల్లవరం తీసుకు వెళ్లారు. హిందువులు పీరును దర్శించుకుని పూజలు చేశారు.

పంజాల నిర్వహణకు ఆర్థిక సాయం

మలికిపురం: మొహర్రం సంతాప కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వం పంజాకు రూ.ఐదువేలు చొప్పున ఆర్థిక సాయం అందజేసింది. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చేతుల మీదుగా శనివారం విశ్వేశ్వరాయపురంలో లబ్ధిదారులకు సహాయం అందజేశారు.

కళ్లె నమూనా సేకరణ క్యాంపు

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురంలో శనివారం వీరవల్లిపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కళ్లె నమూనా సేకరణ క్యాంపు నిర్వహించారు.ఈ క్యాంపు కార్యాలయాన్ని డీఎంఅండ్‌హెచ్‌ఓ భరతలక్ష్మి ప్రారంభించారు. ఎడతెరిపి లేని దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారు కళ్లె పరీక్షలు చేయించుకోవాలన్నారు. రెండు వారాల పైబడి దగ్గు, జ్వరం ఉన్నా, బరువు తగ్గుతున్న, రక్తం పడుతున్న వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. లక్షణాలు ఉన్న 40 మంది నుంచి కళ్లె సేకరించారు. ఆమె వెంట వీరవల్లిపాలెం పీహెచ్‌సీ వైద్యులు పి.విజయ్, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

స్మార్ట్ మీటర్లు బిగించవద్దని వినతిపత్రం

సఖినేటిపల్లి: విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ మేరకు రెవెన్యూ కార్యాలయంలో నాయకులు ఒక వినతిపత్రం అందజేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, నాయకులు దేవ రాజేంద్రప్రసాద్, చెల్లుబోయిన తాతాజీ, దొండపాటి చిట్టిరాజు, డి.భానోజీ, వై.వెంకట్, జి.తిరుపతి, డి.చంద్రమోహన్ పాల్గొన్నారు.


మానవత్వం చాటుకున్న సీఐ


ఆలమూరు కొత్త వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తిని ఆస్పత్రికి తరలిస్తున్న సీఐ విద్యాసాగర్

ఆలమూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఒక వ్యక్తిని హుటాహుటిన ప్రైవేటు ఆస్పత్రికి తరలించి రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ మానవత్వం చాటుకున్న సంఘటన ఆలమూరులో జరిగింది. 216 ఏ జాతీయ రహదారిలోని ఆలమూరు గౌతమీ గోదావరి కొత్త వంతెనపై నాలుగు చక్రాల వాహనం ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో అటు వైపు వెళుతున్న సీఐ విద్యాసాగర్ ఈ ప్రమాద దృశ్యం కంటపడింది. హుటాహుటిన గాయపడ్డ ఆ వ్యక్తిని సాటి వాహనదారుల సాయంతో తన జీప్‌లో ఎక్కించుకుని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం గాయపడిన వ్యక్తిని పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం గ్రామానికి చెందిన తేతలి దుర్గాప్రసాద్‌రెడ్డిగా గుర్తించారు. ఆమేరకు సేకరించిన వివరాల ద్వారా బంధువులకు సమాచారాన్ని అందించి మెరుగైన వైద్యం అందించేందుకు సహకరించారు. అలాగే గత జూన్ 13న ఈ వంతెనపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోతున్న మహిళను రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ప్రజారోగ్యం లక్ష్యంగా సంపూర్ణ పారిశుధ్యం

కొత్తపేట: ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పీహెచ్‌సీలు, గ్రామ పంచాయతీలు దోమల నివారణకు, సంపూర్ణ పారిశుధ్యానికి తగు చర్యలు చేపట్టాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గూడపాటి రమాదేవి సంబంధిత అధికారులు, సిబ్బందికి సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ రమాదేవి పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అభివృద్ధి, సభ్యులు, సర్పంచ్‌లు లేవనెత్తిన వివిధ అంశాలు, సమస్యలపై సమీక్షించారు. గ్రామాల్లో పారిశుధ్యం బాగోలేదని, ఎక్కడి చెత్త అక్కడే వుంటుందని, డ్రైన్లలో పూడికతీసి అక్కడే వదిలేస్తున్నారని, పలు వీధులకు రెగ్యులర్‌గా పారిశుధ్య సిబ్బంది రావడం లేదని జెడ్పీటీసీ రమాదేవి ప్రస్తావించారు. ఎంపీపీ గంగాధరరావు మాట్లాడుతూ వర్షాకాలం, వ్యాధుల సీజన్ నేపథ్యంలో శానిటేషన్‌పై దృష్టి పెట్టండి.. ఫాగింగ్ మెషీన్లు, స్ప్రేయర్లను బయటకు తీయండి.. అని పంచాయతీ అధికారులకు సూచించారు. స్థానిక కౌశిక డ్రైన్ ప్రభుత్వ నిధులా? ప్రైవేట్ నిధులా? అని ఎంపీపీ గంగాధరరావు డ్రైన్స్ అధికారిని ప్రశ్నించారు. దానిపై ఆయన వివరణ ఇస్తూ గతంలో రూ.35 లక్షలకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, అయితే కాంట్రాక్టర్ పని చేపట్టకపోవడంతో ఆ టెండర్ పెండింగ్‌లో ఉందని, అయితే కలెక్టర్ రూ.30 లక్షలు ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో ప్రస్తుతం పనులు ప్రారంభించామని తెలిపారు. ఇలా పలు సమస్యలపై పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంబంధిత అధికారులను ప్రశ్నించగా వారు సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో సర్పంచ్‌లు సాగి బంగారాజు, బూసి జయలక్ష్మి, దూనబోయిన నవదీప, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


పంటల బీమా పథకం ప్రచార ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, జెడ్పీటీసీ రమాదేవి

వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కూనపరెడ్డి



రాజోలు: మండలంలోని శివకోటి గ్రామానికి చెందిన కూనపరెడ్డి రాంబాబు జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు పార్టీ అధిష్టానం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. తనను జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమించడానికి సహకరించిన నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డికి రాంబాబు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా పార్టీ ఆర్గనైజేషనల్ సెక్రటరీగా ఏసుబాబు

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీగా పి.గన్నవరం మండలం రాజులపాలెం గ్రామ సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఏసుబాబును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. తనను నియమించిన పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తదితరులకు ఏసుబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఏసుబాబును పార్టీ నాయకులు తదితరులు అభినందించారు.

లోక్ అదాలత్‌లో 131 కేసుల పరిష్కారం

రాజోలు: స్థానిక కోర్టు కాంప్లెక్స్ శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ ద్వారా 131 కేసులను పరిష్కరించారు. సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు కోర్టు హాలులో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ వేదికగా నిలుస్తుందన్నారు. ఎన్నో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులకు కక్షిదారుల ఇరువురు సమ్మతితో రాజీ చేయడం జరుగుతుందన్నారు. లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించిన 131 కేసుల ద్వారా 44.88 లక్షల ఆర్థిక లావాదేవీలకు పరిష్కారం లభించింది. ఏడు సివిల్ కేసులు, 73 క్రిమినల్ కేసులు, 51 పీఎల్‌సీలను పరిష్కరించారు. లోక్ అదాలత్ సభ్యులు దివి శ్రీనివాస్, వై.లక్ష్మీసుధ, న్యాయవాదులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలి

పి.గన్నవరం: రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. రాష్ట్ర అటవీ శాఖ ఐటీ సలహాదారుడిగా నియమితులైన పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామానికి చెందిన పెనమరెడ్డి నాగబాబును ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వారు సత్కరించారు. నాగబాబును పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పెనుమాల లక్ష్మి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, ఆదిమూలం సూరయ్యకాపు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ మృతికి శెట్టిబలిజ నేతల నివాళి

మామిడికుదురు: రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాసరావు మృతి తీరని లోటని మామిడికుదురు మండల శెట్టిబలిజ సంఘం పేర్కొంది. మామిడికుదురులో శనివారం జరిగిన సంతాప సభలో శ్రీనివాస్ శెట్టిబలిజ సంఘాన్ని బలోపేతం చేసేందుకు చేసిన కృషిని కొనియాడారు. మంచి భవిష్యత్తు ఉన్న శ్రీనివాసరావు చిన్న వయస్సులోనే మృతి చెందడం దురదృష్టకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సభలో సంఘం అధ్యక్షులు కాండ్రేగుల శ్రీనివాస్, బొక్కా వీర వెంకటేశ్వర రావు, మట్టపర్తి రెడ్డి, జోగి రామకృష్ణ, వాసంశెట్టి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా నరసింహం

అంబాజీపేట: స్థానిక ఎంపీడీఓ (ఎఫ్ఏసీ) అధికారిగా ఎపీఎల్.నరసింహం ఉద్యోగ బాధ్యతలను శనివారం స్వీకరించారు. నరసింహం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఎఫ్ఏసీ ఎంపీడీఓగా ఆదేశాలు అందినట్లు ఆయన తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నరసింహంను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, స్థానిక సిబ్బంది అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు చిన్నారులు

కొత్తపేట: స్థానిక స్వామి వివేకానంద యోగా ఆశ్రమంలో శిక్షణ పొందుతున్న బండారు శ్రావణి, నల్ల ప్రవీణ్ అమలాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. జూనియర్ కేటగిరీలో ఎంపికైన ఈ ఇద్దరు చిన్నారులు గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పోటీలు, వైజాగ్‌లో జరిగిన రాష్ట్ర యోగా పోటీల్లో విజయం సాధించారని తెలిపారు. ఈ విద్యార్థులు ఆగస్టులో ఢిల్లీలో జరిగే జాతీయ యోగా పోటీలకు జూనియర్ కేటగిరిలో పాల్గొంటారని ఆయన తెలిపారు

పేద విద్యార్థులకు సాయం

ఆలమూరు: మండలంలోని పెదపళ్లకు చెందిన పురోహితులు మేడవరపు లక్ష్మణరావు, దీక్షితుల రామకష్ణ శర్మ శనివారం ఇష్టకామేశ్వరి ఫౌండేషన్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థను ప్రారంభించారు. ఈ సహాయ సంస్థ ఎటువంటి లాభాపేక్ష లేకుండా కులమతాలకు అతీతంగా పేద విద్యార్థుల చదువు కోసం ఆర్థికంగా అండగా ఉంటామని తెలిపింది. ఈ ఫౌండేషన్ పూర్తి ప్రభుత్వ నిబంధనలతో పనిచేస్తుందన్నారు. విరాళాలు ఇచ్చే దాతలకు ఆదాయ పన్ను నుంచి మినహాయింపు లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు.